అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- జగనన్న సురక్షలో భాగంగా ఎమ్మెల్సీ ఏసురత్నం, కమిషనర్ కీర్తి చేకూరిలతో కలిసి ధ్రువీకరణ పత్రాలు అందజేత



విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, కమిషనర్ కీర్తి చేకూరి, కార్పొరేటర్ కరుణకుమారి

నగరంపాలెం: ప్రభుత్వ సేవలను అర్హులకు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. శనివారం కేవీపీకాలనీ ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ భవన్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారి సమస్యలు గుర్తించి, ప్రభుత్వ సేవలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని చెప్పారు. జూలై నెల అంతటా ప్రతి గడపకు వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, అధికార, ప్రజా ప్రతినిధులు వెళ్లి సమస్యలు గుర్తించేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఈ క్రమంలో గతవారం రోజులు 25వ డివిజన్‌లోని ప్రతి ఇంటికెళ్లి, వివిధ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల వివరాలు, అవసరమైన ధ్రువపత్రాల అర్జీలు సేకరించారని పేర్కొన్నారు. ఎక్కువగా కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, జనన, కుటుంబ సభ్యులు, రేషన్ కార్డులకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. సచివాలయాల పరిధిలో ఎటువంటి ప్రభుత్వ సేవలైనా కార్యదర్శుల ద్వారా పొందవచ్చని తెలిపారు. జగనన్న సురక్షలో భాగంగా డివిజన్లలో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారానికై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని అన్నారు. 25వ డివిజన్‌లో సుమారు రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా సంక్షేమ పాలన కొనసాగుతుందని అన్నారు. కోవిడ్-19 సమయంలోనూ సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేశారని అన్నారు. గతంలో ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే రూ.వేలల్లో వెచ్చించాలని, నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని అన్నారు. కుటుంబ, కుల, ఆదాయ, జనన, మరణ తదితర ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకున్న వారికి పత్రాలను అందించారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ మహాత్మాగాంధీ చెప్పిన గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్ సాకారం చేశారని అన్నారు. జగనన్న సురక్ష ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాలకు ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలు అందిస్తారని పేర్కొన్నారు. కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి, ఎస్‌ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంహెచ్‌ఓ భానుప్రకాష్, డీఈఈ రమేష్‌బాబు, పశ్చిమ తహసీల్దార్ సాంబశివరావు, నోడల్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

21వ డివిజన్‌లో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు..

ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా స్థానికుల యోగా క్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించినట్లు ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. 21వ డివిజన్‌లోని కేఎస్‌ఆర్టీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలని, ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదన్నదే జగనన్న సురక్ష లక్ష్యమని అన్నారు. ప్రస్తుత నాలుగేళ్ల పాలనకు గత టీడీపీ పాలనకు బేరీజు వేసుకోవాలన్నారు. గతంలో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు నరకయాతన పడాల్సి వచ్చేదని, జన్మభూమి కమిటీలు పరిశీలించేసరికి ఏడాది గడిచేదని ఆరోపించారు. తర్వాత పెన్షన్, ఇతరత్రా పథకాలు వస్తాయా లేదా అనేది స్పష్టత ఉండదని అన్నారు. జగనన్న సురక్షలో భాగంగా వారం రోజులు ముందుగా వలంటీర్లు వచ్చి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారని అన్నారు. ఈ క్రమంలో 707 ధృవీకరణ పత్రాలను అర్హులకు పంపిణీ చేశామని చెప్పారు. ఎక్కువగా కుల, ఆదాయం, జనన ధ్రువీకరణ పత్రాలలో పేర్లు నమోదు పత్రాలు అందించామని చెప్పారు. 21వ డివిజన్‌లో రూ.12 కోట్లతో రహదారులు, కాలువల నిర్మాణాలకు కేటాయించామని, కొన్ని పనులు మొదలవగా, మరికొన్నింటికి టెండర్ల ప్రక్రియ జరుగుతుందని అన్నారు. త్వరలో యతిరాజుకాలనీలో 110 మంది ఇళ్లకు ఉచిత రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగనుందని అన్నారు. తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు మరో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి చర్యలు చేపడతామని చెప్పారు. డివిజన్ కార్పొరేటర్ కాండ్రుకుంట గురవయ్య, సచివాలయాల అడ్మిన్లు, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ మోదీ స్టిక్కర్లు



కరపత్రాలు అందజేస్తున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక అమరావతి రోడ్డులోని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు ఆధ్వర్యంలో బీజేపీ నేతలు ఇంటింటికి తిరిగి ప్రధాని నరేంద్రమోదీ అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించి కరపత్రాలు అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్, పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తోటా రామకృష్ణ, పాలపాటి రవికుమార్, ఈమని మాధవరెడ్డి పాల్గొన్నారు.

పురందేశ్వరి నియామకంపై హర్షం..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా పురందేశ్వరిని మంగళవారం జాతీయ నాయకత్వం నియమించడంపై గుంటూరుకు చెందిన బీజేపీ సీనియర్‌నేత యలవర్తిపాటి పాండురంగ విఠల్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పురందేశ్వరి ఆధ్వర్యంలో బీజేపీ మరింత బలోపేతం అవుతోందన్నారు.

జిన్నాటవర్ సెంటర్ వద్ద ఆందోళన...

గుంటూరులోని జిన్నాటవర్ సెంటర్ వద్ద మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నేతలు ఆందోళన చేశారు. జిన్నాటవర్ వద్ద జాతీయ జెండాను మార్చాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. నెలరోజుల కిందట జెండా మార్చాలని అధికారులకు వినతి పత్రం అందజేశామని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని వెల్లడించారు. జాతీయ జెండా నల్లగా మారిందన్నారు. ఆందోళన చేస్తున్న రామకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ నిచికేత్, సీఐ సుబ్బారావు, చిత్రంలో ముసుగులో ఉన్న నిందితుడు

పట్నంబజారు: నివాసాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ ఏఎస్పీ నిచికేత్ షెలేకే, పాతగుంటూరు పీఎస్ సీఐ ఎంవీ సుబ్బారావు వివరాలను వెల్లడించారు. గత నెల 21వ తేదీన ఆనందపేటలోని నివాసం ఉండే ఉపాధ్యాయుడు అబ్దుల్ షబ్బీర్‌అహమ్మద్ నివాసంలో చోరీ జరిగింది. ఇంటి తలుపులు తీసుకుని కుటుంబసభ్యులంతా ఇంట్లో ఉండగానే 155 గ్రాముల బంగారం, 450 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.2లక్షల నగదు అపహరణకు గురయింది. బాధితుడి నుంచి ఫిర్యాదు అందుకున్న పాతగుంటూరు సీఐ ఎంవీ సుబ్బారావు క్రైం సిబ్బందితో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడి ఆచూకీ కోసం ప్రయత్నం చేస్తున్న సమయంలో తెలుపు రంగులో ఉన్న టీవీఎస్ రేడియన్ బైక్‌పై నిందితుడు వచ్చినట్లు గుర్తించారు. బైక్ కొనుగోలు చేసిన యజమానుల జాబితా లిస్ట్‌ను తీసుకుని, దర్యాప్తు ప్రారంభించారు. వినోభానగర్‌కు చెందిన షేక్ మొహమ్మద్ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నందివెలుగు రోడ్డులో ఈ నెల 3వ తేదీన అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారించటంతో చోరీ చేసినట్లు అంగీకరించాడు. చోరీకి గురైన 133 గ్రాముల బంగారం, 308 గ్రాముల వెండి ఆభరణాలు రూ.4లక్షలు విలువ చేసేవి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మొహమ్మద్‌పై గతంలో ప్రత్తిపాడు, నల్లపాడు ప్రాంతాల్లో స్టేషన్ పరిధిలో మూడు కేసులు ఉన్నట్లు వెల్లడించారు. ఇంటి తలుపులు తొలగించి చోరీలు చేస్తాడని తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవటంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ ఖాజీబాబు, హెచ్‌సీ కె.కోటేశ్వరరావు, పీసీలు పి.శంకర్, పి.సాంబశివరావు, ఎండీ ఇర్ఫాన్, పి.మురళీ, ఆర్.హనుమాన్‌సింగ్, ఐటీ కోర్ జి.బాలాజీలను అభినందించారు.

పేదల పాలిటి పెన్నిధి రంగా



రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ తుమ్మల

గుంటూరు రూరల్: పేదల పాలిటి పెన్నిధి, కార్మిక నాయకుడు వంగవీటి మోహనరంగా జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు తెలిపారు. మంగళవారం చిన్నపలకలూరు గ్రామంలో వంగవీటి మోహన రంగా జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంద్ర, తంగెళ్ళ నాగేశ్వరరావు, ఎం.వెంకటేశ్వర్లు, బి చిన్నపోతురాజు, పి.శ్రీనివాసరావు, కె.శ్రీను, డి.శ్రీనివాసరావు, బి.భాస్కర్, అనిల్‌కుమార్, బాజీ, నరేష్, అంకమ్మరావు పాల్గొన్నారు.

ముట్లూరులో వంగవీటి జయంతి

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో మంగళవారం రాత్రి వంగవీటి మోహనరంగా 76వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కాపు నాయకులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పి.భవన్నారాయణ, కె.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, పి.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి

పెదకాకాని: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగ అని ఎంపీపీ తుళ్ళిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. వెంకట కృష్ణాపురం గ్రామంలో వంగవీటి మోహన్ రంగ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రక్తదానం చేస్తున్న అభిమానులు

పెదకాకాని సెంటర్లో వంగవీటి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 25 మంది యువకులు రక్తదానం చేశారు.

ఆర్‌వీఆర్‌జేసీలో నూతన ఆవిష్కరణలపై సదస్సు



గుంటూరు రూరల్: విద్యార్థులు నిరంతర ఆవిష్కరణలు చేయాలని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో సాఫ్ట్ స్కిల్స్, ఎంటర్ ప్రెన్యూర్ షిప్‌పై సెమినార్ నిర్వహించారు. సెమినార్స్ వల్ల విద్యార్థుల్లో నూతన ఆలోచనా విధానాలు మెరుగుపడుతాయన్నారు.

అమెరికాలోని క్లౌడ్ కోన్స్ సెక్యూరిటీ కంపెనీ సీఈఓ, వ్యవస్థాపకులు బాలాజీ పరిమి, జెన్‌పాక్ట్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రాజ్ సజ్జలు అతిథులుగా పాల్గొని, విద్యార్థులకు సందేశాన్ని అందించారు. సెమినార్‌లో కళాశాల విద్యార్థులు తయారు చేసిన కృత్రిమ అవయవాలను, వాటి పనితీరును, ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్, డాక్టర్ స్వర్ణశ్రీ అతిథులను ఘనంగా సన్మానించారు.

జీజీహెచ్‌కు దాతల సాయం అభినందనీయం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి దాతలు చేస్తున్న సహాయం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం హీల్స్‌ఫార్స్ ఇండియా లిమిటెడ్‌కు వల్లూరి శివప్రసాద్ రూ. 50వేలు విలువ చేసే వైద్య పరికరాలు డాక్టర్ కిరణ్‌కుమార్ అందజేశారు. నెఫ్రాలజీ వైద్య విభాగానికి నెఫ్రాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గొంది శివరామకృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్‌కిరణ్‌కుమార్ వైద్య పరికరాలు అందజేశారు. జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌కుమార్ వైద్యులు, వైద్య సిబ్బంది వినియోగించేందుకు అవసరమైన సబ్బులు అందజేశారు. డాక్టర్ కిరణ్‌కుమార్ నూతనంగా బాధ్యతలు స్వీకరించాక తనకు అభినందనలు తెలిపేందుకు వచ్చేవారితో పూలు, బొకేలు తీసుకు రావద్దని, రోగులకు ఉపయోగపడే మందులు ఇవ్వాలని కోరారు. ఈనేపథ్యంలో పలువురు డాక్టర్ కిరణ్‌కుమార్‌ను కలిసి సిరంజ్‌లు, వైద్య పరికరాలు అందజేస్తున్నారు.

ధ్యానం వలన ఆరోగ్యం

కాకుమాను: ధ్యానం సర్వరోగ నివారిణి అని సీనియర్ పిరమిడ్ మాస్టర్ అంజలి అన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీ ఆత్మలక్ష్మి ధ్యాన మందిరంలో నిర్వాహకుడు రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక ధ్యాన శిబిరం నిర్వహించారు. సీనియర్ నిపుణులు అంజలి మాట్లాడుతూ రోజూ ధ్యానం చేయ డం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ధ్యాన మందిరంలో ఉదయం, సాయంత్రం అనుభవజ్ఞులతో ఉచితంగా ధ్యానం చేయించడం జరుగుతుందని తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. కాకుమాను ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఎంఈఓ పరిశీలించారు. మారిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని ఆయన ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, పలు రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

రంగా ఆశయసాధనకు కృషి చేద్దాం



రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో వంగవీటి మోహనరంగా మహోజ్వల శక్తిగా ఎదిగారని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. మంగళవారం వంగవీటి మోహనరంగా జయంతిని పురస్కరించుకొని నగరంలోని 20వ డివిజన్ సంపత్‌నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో శ్రీనివాసరావు పేట అచ్చయ్య ధాబా సెంటర్, నగరంపాలెం లోని మూడు బొమ్మల సెంటర్లలోని రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా చిరస్మరణీని, తక్కువ కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారని తెలియచేశారు. వంగవీటి మోహన రంగా ఎంతోకాలం రాజకీయాలలో లేరని, చాల తక్కువ వ్యవధిలోనే ఆయన ప్రజా నాయకుడిగా ఎదిగారన్నారు. వంగవీటి రంగా ఆశయాలకు అనుగుణంగా వైఎస్సార్ సీపీ కాపుల అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా, పార్టీలో వారికి అధిక ప్రాధాన్యతనిచ్చిందని తెలియచేశారు. కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, డివిజన్ల ప్రెసిడెంట్లు, కాపు నాయకులు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు అల్లూరి

గుంటూరు ఎడ్యుకేషన్: మాతృభూమిపై పరాయి పాలకుల పెత్తనానికి వ్యతిరేకంగా బ్రిటిష్‌వారిపై తిరగబడిన అల్లూరి సీతారామరాజు పోరాట యోధుడని జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. మంగళవారం మన్యం వీరుడు అల్లూరి జయంతి సందర్భంగా అరండల్‌పేటలోని జెడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత స్వాతంత్య్ర చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని, సాయుధ పోరాటంతోనే స్వాతంత్య్రం సిద్ధిస్తుందని నమ్మి దాని కోసం ప్రాణాలర్పించిన వీరుడని కొనియాడారు. జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మీ, గ్రంథపాలకుడు కె.చిన్నపరెడ్డి, ఎన్.నాగిరెడ్డి, ఉద్యోగులు వై.బ్రహ్మయ్య, పి.కోటేశ్వరి, జి.కళ్యాణి, జి.అచ్చమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

– ఏసీ కళాశాల వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ కె.సుధాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బత్తుల దేవానంద్



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు

టీజేపీఎస్ కళాశాలలో...

గుంటూరు ఎడ్యుకేషన్: మన్యం వీరుడు అల్లూరి తెలుగువారి గుండెల్లో ఎప్పటికీ సజీవంగా నిలిచి ఉంటారని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కె.వీరబ్రహ్మం మాట్లాడుతూ అల్లూరి రగిలించిన స్వాతంత్య్ర స్ఫూర్తిని నేటి యువత ఆకళింపు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.అనితాదేవి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త జేవీ సుధీర్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళీధర్, జి.సురేష్‌బాబు, జయశైలజ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశ మందిరంలో ...

నెహ్రూనగర్: అల్లూరి సీతారామరాజు దేశ స్వాతంత్య్రం కోసం చేసిన ప్రాణ త్యాగాన్ని నేటి తరానికి తెలియచేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్ర బాబు (డైమండ్ బాబు), అదనపు కమిషనర్ పెద్ది రోజాలు పేర్కొన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మేనేజర్ శివన్నారాయణ, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల నుంచి స్ఫూర్తి పొందాలి



మన్నవ రాధాకృష్ణమూర్తిని సత్కరిస్తున్న జూపూడి రంగరాజు, డాక్టర్ రమణ యశస్వి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: వైద్య రంగంలో కీర్తి గడించిన మహనీయుల నుంచి విద్యార్థులు స్ఫూర్తిని పొందాలని హిందూ ఫార్మసీ కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాతీయ వైద్యుల దినోత్సవ కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు ప్రముఖ వైద్యులను సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ సీఎంగా పని చేసిన డాక్టర్ బీసీ రాయ్ వైద్యుడిగానే కాకుండా సమాజానికి అందించిన సేవలతో భారతరత్న బిరుదు పొందారని తెలిపారు. అటువంటి వారిని విద్యార్థులు తప్పక స్మరించుకుని వారి బాటలో నడవాలని సూచించారు. ఈసందర్భంగా జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ రమణ యశస్విని సత్కరించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ పి.సీతారామయ్య, హెచ్‌ఓడీ హేమకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజలు తెలిపిన సమస్యలను కమిషనర్‌కు ఫోన్‌లో వివరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: ప్రజా సమస్యల పరిష్కారానికి జోరు వానను లెక్క చేయకుండా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. మంగళవారం నియోజకవర్గంలోని 4,14 డివిజన్‌ల పరిధిలో జోరు వానలో సైతం జరిగిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కళ్ళికోటిరెడ్డి బజారులో పోస్టాఫీస్ లైనుకు సంబంధించి రూ.20లక్షలతో సైడ్ డ్రైన్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చెక్కలబజారులో రోడ్డు వేయించాలని, సైడ్ కాలువల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే ముస్తఫా దృష్టికి స్థానికులు తీసుకునివచ్చారు. ఆయా డివిజన్‌లలో పర్యటించిన ఎమ్మెల్యే స్థానికులు చెప్పిన ప్రతి సమస్యను నగర కమిషనర్ కీర్తి చేకూరి దృష్టికి ఫోన్‌లో తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ శివారు కాలనీల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రతి సమస్యను ఖచ్చితంగా పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతోందన్నారు. ప్రతి గడపకు సంక్షేమాన్ని అందజేసిన ఘనత సీఎం జగన్ జగన్‌కే దక్కుతుందన్నారు. మేలు జరిగితేనే ఓటు వేయండి అనే సత్తా ఉన్న ఏకైక నేత సీఎం జగన్ అని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకునిరావాలని కోరారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్‌లు షేక్ నూరిఫాతిమా, మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సంకూరి శ్రీను, అజయ్, వాకా శ్రీనివాసరెడ్డి, ముస్తఫా, మురళీ, శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ ముఖ్యనేతలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమం...

తూర్పు నియోజకవర్గంలోని 4, 14 డివిజన్‌లలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ముస్తఫా, పార్టీ నేత నూరిఫాతిమాలు హాజరై ప్రజలకు సంబంధించి దరఖాస్తులకు సంబంధించి పత్రాలను అందజేశారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు వేముల జ్యోతిపద్మజ, మెహమూద్, పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. యు.లక్ష్మీపతి అరండల్‌పేట 16/3లో ఎల్వేజ్ పేరుతో ఓ సంస్థ ప్రారంభించాడు. గృహోపకరణాలు, సరుకులు అతితక్కువ ధరకు ఇస్తానని నమ్మించాడు. పలువురు సభ్యులుగా చేరారు. ఇదే క్రమంలో తమ సంస్థలో మేనేజర్ ఉద్యోగం ఇస్తానని ఇబ్రాయిలీపేటకు చెందిన మొహమ్మద్ షహంషాను నమ్మించాడు. దీనికోసం రూ.3లక్షలు చెల్లించాలని చెప్పగా షహంషా ఆ మేరకు లక్ష్మీపతికి చెల్లించాడు. లక్ష్మీపతి రూ.3 లక్షలు తీసుకుని ఉద్యోగం ఇవ్వకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎల్వేజ్ సంస్థకు వ్యాపారం చేసేందుకు గుర్తింపు లేదని విచారణ చేపట్టారు.

7న డిగ్రీ విద్యావిధానంపై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి బీఎస్సీ, బీసీఏ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంపై ప్రత్యేక అవగాహనా సదస్సును ఈ నెల 7న నిర్వహించనున్నట్లు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందస్సును పలకలూరు రోడ్‌లోని, విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. వివరాలకు 98663 99808 సంప్రదించాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ జూలై డెంగీ మాసమని చెప్పారు. గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలతో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ మాట్లాడుతూ సర్వేలను పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రామాల్లో మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆశా నోడల్ ఆఫీసర్ నిర్మల మాట్లాడుతూ ప్రతి రోజూ ఆశా కార్యకర్తలు కిల్కారీ యాప్ ద్వారా 14423 నంబరుకు కాల్ చేసి రోగి వివరాలను తెలియజేయాలన్నారు. సమావేశంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో డిజిటల్ బోధన



వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): ప్రభుత్వ బడుల్లో అత్యాధునిక వసతులతో డిజిటల్ తరగతి గదుల్లో విద్యాబోధన చేయడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి జి. సత్యనారాయణమూర్తి అన్నారు. అనంతవరప్పాడు ఆర్‌బీఆర్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, విద్యా నైపుణ్యాలను పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకం అమలు పక్కాగా ఉండాలని ఆదేశించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

డయాలసిస్ పేషెంట్‌కు పింఛను మంజూరు



పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల మంజూరులో వివక్షకు తావులేకుండా పారదర్శకంగా మంజూరు చేస్తోందని మాజీ ఎంపీటీసీ మన్నవ మహేంద్రబాబు అన్నారు. పెదగొట్టిపాడు ఆది ఆంధ్రా కాలనీకి చెందిన పల్లపాటి మత్తయ్య గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. కొద్దిరోజుల కిందట డయాలసిస్ పింఛనుకు దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వం ఈ నెల పింఛను మంజూరు చేసింది. మాజీ ఎంపీటీసీ మహేంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ కీర్తన, వలంటీర్ ప్రవీణ మంగళవారం సాయంత్రం మత్తయ్యకు పింఛను నగదు రూ.10 వేల రూపాయలను అందించారు.